నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | జులై 04, 2024 | www.navatelangana.com

షబ్బీర్ అలీ డబ్బులు ఇస్తేనే విద్యుత్‌శాఖ పనులు



నవతెలంగాణ-భిక్కనూర్

ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని గిద్ద హరిజనవాడ కాలనీవాసులు, పట్టణ ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం సమర్పించినా అధికారులు పట్టించుకోలేదు. కాగా మంగళ వారం ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ మండల ప్రత్యేక సమావేశా నికి హాజరు కాగా ఆయన దృష్టికి రావడంతో విద్యుత్ పోల్ సమస్యను పరిష్కరించాలని డబ్బులు చెల్లించి ఆదేశించారు. దీంతో బుధవారం విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ పోల్‌ను తొలగించారు. షబ్బీర్ అలీ మాటతో విద్యుత్ పోల్ సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు, వాహనదారులు ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై కళాబృందం అవగాహన

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో టేక్రియాల్ గ్రామ కస్తూర్బా పాఠశాలలో కళాబృందం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి బాధితులు ఫిర్యాదులు చేసుకోవచ్చు తెలిపారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ సోషల్‌మీడియాకు సంబంధించిన సెక్యూరిటీకి సంబంధించిన విషయాలు పిల్లలకు తెలియజేశారు. మూఢనమ్మకాలపై చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో దేవునిపల్లి ఏఎస్ఐ, కళాబృందం సభ్యులు శేషు, ప్రభాకర్, సైబర్ సెక్యూరిటీ బృందం ప్రవీణ్, సాయిలు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాబృందం



- రైతు భరోసాపై నీలినీడలు
- రక్షిత కౌలుదారి చట్టానికి మంగళం
- పెరిగిన పంట సాగు ఖర్చులతో గిట్టుబాటు కానీ వ్యవసాయం
- అప్పుల ఊబిలోకి కౌలు రైతులు
- వారి ఆత్మహత్యలను రైతు ఆత్మహత్యలుగా గుర్తించని ప్రభుత్వం
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

కౌలు గోడు

సందిగ్ధంలో కౌలు రైతు

నవతెలంగాణ-నిజామాబాద్

వాళ్ల పేరు మీద గుంటెడు భూమి లేదు. కానీ ఆ భూమి మీద వాళ్లకెంతా ప్రేమ. ఆ భూమినే నమ్ముకుని పుడమికి పురుడు పోస్తారు.. పుట్ల కొద్ది పంట తీస్తారు.. ప్రజల కడుపు నింపి వాళ్లు మాత్రం పస్తులుంటారు.. అప్పుసప్పు జేసి సాగుజేస్తే.. కౌలే ఎల్లకపాయే.. వచ్చిన రాబడి.. అప్పుల వడ్డీలకే సరిపాయే.. ఏటికేటి అప్పులు పెరిగి.. మెడకు ఉరితాడు బిగియవట్టే.. వీళ్ల కోసం చేసిన చట్టాలు కాగితాలకే పరిమితం. వీళ్లను అసలు రైతులే కాదందీ గత ప్రభుత్వం. గీళ్లకు న్యాయం జేస్తామని అధికారంలోకి వచ్చింది ఇప్పటి ప్రభుత్వం. కానీ పంటలు మొదలైనా ఇంకా 'భరోసా' రాకపాయే. గిన్ని కష్టాల నడుమ సాగు ముందుకెట్లా సాగేది.' ఇది కౌలు రైతుల గోడు. సాగు పరంగా కౌలు రైతుల సంఖ్య గణనీయంగా ఉన్నప్పటికీ.. ప్రభుత్వాల నుంచి మాత్రం ఎలాంటి సాయం అందడం లేదన్నది కాదనలేని వాస్తవం. వ్యవసాయం కోసం అప్పుల ఊబిలో చిక్కి ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న కౌలు రైతులపై కథనం.

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సాగుకు అనువైన భూమి 10 లక్షల 50 వేల 258 ఎకరాలు ఉంది. ఇందులో నిజామాబాద్ జిల్లాలో 5,13,355 ఎకరాలు కాగా, కామారెడ్డి జిల్లాలో 5,36,903 ఎకరాలు ఉంది. అయితే వర్షాకాలం సీజన్‌లో సుమారు 9 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతుండగా.. రబీలో సుమారు 8.5 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ అంచన. రైతుబంధు లెక్కల ప్రకారం.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3.40 లక్షల మంది రైతులు ఉన్నారు. అయితే వీరిలో ఎక్కువ మంది సన్న, చిన్నకారు రైతులే ఉన్నారు. వారికి రెండు ఎకరాల కంటే తక్కువ సాగు విస్తీర్ణం ఉన్న రైతులే అధికం. దీంతో వారు బడా భూస్వాముల భూములను కౌలుకు తీసుకుంటూ సాగు చేస్తున్నారు. మొత్తం రైతుల్లో సుమారు 40 శాతం మంది కౌలురైతులే ఉన్నారు. రైతు పేరుతో సంక్షేమ పథకాలను బడా భూస్వాములు, వ్యాపారులు పొందుతుంటే.. వ్యవసాయం చేసి నష్టపోయి ఆత్మహత్యల పాలవుతున్నది కౌలు రైతులు. ఈ దుస్థితి ఉమ్మడి జిల్లాలో కౌలు రైతు కుటుంబాలకు కంటిమీద కనుకు లేకుండా చేస్తోంది.

జిల్లాలో సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నవారు. ఉన్న దానిలో వ్యవసాయం చేస్తే తప్పా ఇల్లు గడవని పరిస్థితి. అట్లని వ్యవసాయం విడిచి మరో పనిచేయలేక.. బీడుగా ఉన్న వ్యాపారుల భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. పంట సాగు ఖర్చులు పెరుగడంతో ప్రస్తుతం సొంత భూమిలో వ్యవసాయం చేస్తేనే దినసరి కూలి గిట్టుబాటు కావడం లేదు. ఇక కౌలు రైతులు పరిస్థితి ఎట్లా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

తగ్గని రైతు ఆత్మహత్యలు..

రైతులు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీరంతా కౌలు రైతులు కావడంతో ప్రభుత్వం వీరిని రైతులుగా గుర్తించడం లేదు. రైతు కుటుంబాలకు అందే సహకారం కౌలు రైతుకు అందకపోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఆ బాధిత కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యతతోపాటు కౌలు రైతులకు ఆర్థిక చేయూతనిచ్చి వారికి ప్రభుత్వం అండగా నిలవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

రక్షిత కౌలుదారి చట్టానికి మంగళం..

కౌలు రైతులకు వ్యవసాయం రంగంలో ప్రోత్సహించేందుకు నాటి ప్రభుత్వాలు టెనెన్సీ అండ్ అగ్రికల్చర్ యాక్ట్ కింద రక్షిత కౌలుదారి చట్టాన్ని తీసుకువచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో 2011లో ల్యాండ్ లైసెన్స్‌డ్ కల్టివేటర్స్ యాక్ట్ కింద కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసింది. రైతులకు పంట రుణాలు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, సంక్షేమా పథకాలు అందించింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ చట్టాలకు మంగళం పెట్టింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కౌలు రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చింది. రైతు భరోసాను కూడా ఇస్తామని చెప్పింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనే కౌలు రైతులు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రైతుల నుంచి అఫిడవిట్ తీసుకోవాల్సి ఉంటుందని సూచించడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని, అఫిడవిట్ ఇచ్చే అవకాశం ఉండదని పలువురు పేర్కొంటున్నారు.

కౌలు గుర్తింపు కార్డులివ్వాలి



గత ప్రభుత్వం కౌలు రైతులను అసలే గుర్తించబోమన్నది. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులతో పాటు కౌలు రైతులకు సైతం రైతు భరోసా అమలు చేస్తామని ఆరు గ్యారెంటీ పథకాల్లో వాగ్దానం చేసింది. అందుకు అనుగుణంగా సర్వే చేపట్టి కౌలు రైతులను గుర్తింపుకార్డులు ఇవ్వాలి. దాని ఆధారంగా కౌలు భరోసా, రైతు బీమా అమలు చేయాలి. గుర్తింపు కార్డుతో బ్యాంకులు సైతం రుణాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలి. పంటనష్టం వర్తింపజేయాలి. అప్పుడే కౌలు రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. రైతుల నుంచి అఫిడవిట్ తీసుకోవడం సాధ్యం కాని పని. కౌలు రైతుల ఆధార్‌కార్డు అనుగుణంగా ప్రత్యేకంగా గుర్తింపుకార్డులు ఇవ్వాలి.

పల్లపు వెంకటేశ్. రైతు సంఘం జిల్లా కార్యదర్శి



మాట్లాడుతున్న నాయకులు

నేడు విద్యాసంస్థల బంద్‌ను

విజయవంతం చేయండి

నవతెలంగాణ-కామారెడ్డి/బోధన్

నేడు జరిగే కేజీ టు పీజీ వరకు దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎన్ఎస్‌యుఐ, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నేడు జరిగే దేశవ్యాప్త బంధుపై జిల్లా కేంద్రంలో రోడ్లు భవనాల శాఖ అతిథి గహంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర కోశాధికారి జి.సురేష్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు సందీప్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరుణ్‌లు మాట్లాడుతూ.. లక్షల రూపాయలకు నీట్ పరీక్ష పత్రాలు లీకేజి చేసి లక్షల మంది జీవితాలతో ఎన్‌టిఏ ఏజెన్సీ చెలగాటం ఆడిందని, దేశవ్యాప్త ఆందోళనలు జరిగిన దేశ ప్రధాని ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (నీట్) చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని అన్నారు. మానిటరింగ్ చేయడంలో విఫలం చెందిన కేంద్ర ప్రభుత్వం ప్రజలకు, విద్యార్థులకు సమాధానం చెప్పాలన్నారు. నీట్ నిర్వహణలో వివాదాలు నిత్యం జరుగుతున్న నేపథ్యంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యార్థులు కోరుతున్నట్లు నీట్ ఎగ్జాంను రాష్ట్రాల పరిధిలోకి మార్చాలని కోచింగ్ సెంటర్ల పేరుతో, కన్సల్టెన్సీల పేరుతో పెపర్ లికేజీలు చేస్తున్న నీట్ కోచింగ్ సెంటర్ల అమనుమతులు రద్దు చేసి పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నిట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శివ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మణికంఠ, ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి భరత్, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు సరిచంద్, పివైఎల్ నయాకులు మధు, తదితదిరులు, పాల్గొన్నారు.

బోధన్ : నేడు జరిగే కేజీ టు పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎన్ఎస్‌యుఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఏఐపీఎస్‌యు ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని పిఆర్‌టియు భవన్‌లో పత్రిక విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ బోధన్ డివిజన్ ఇంచార్జి అంజలి మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా ఈ నెల 4న జరిగే దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు ప్రైవేట్ యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐపిఎస్‌యు బోధన్ డివిజన్ కార్యదర్శి సాయికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్, పిడిఎస్‌యు నాయకుడు చందు, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివజీ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలి

- వెంటనే జీవో జారీ చేయాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అంగన్‌వాడీ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ను పెంచుతూ జీవో జారీ చేయాలని పెన్షన్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నా చౌక్‌లో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ రమేష్ బాబు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన మేమో నెంబర్ 1334 ను తక్షణమే ఉపసంహరించుకోవాలని అదేవిధంగా డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులు గత సెప్టెంబర్ నెలలో నిర్వహించిన 24 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మంత్రులు అధికారుల సమక్షంలో ఇచ్చిన హామీ మేరకు 65 సంవత్సరాలు నిండిన టీచర్లకు రెండు లక్షల రూపాయలు, ఆయాలకు లక్ష రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ఇవ్వటానికి అంగీకరించటం తో పాటు ఆసరా పెన్షన్ రిటైర్మెంట్ ఉద్యోగులందరికీ అమలు జరుపుతామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. దానికి భిన్నంగా ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన సర్కులర్లో జీవో నెంబర్ 10 ప్రకారం 65 సంవత్సరాలు నిండిన వారందరికీ రిటైర్మెంట్ ప్రకటించాలని జూలై ఒకటో తేదీ నుండి వారికి జీతాలు ఇవ్వబడవని సర్కులర్ జారీ చేసినట్టు తెలిపారు. జీవో ప్రకారం టీచర్ కు లక్ష రూపాయలు ఆయాకు 50 వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తామని అందులో పేర్కొన్నారని, ఇది పూర్తిగా అంగన్వాడి ఉద్యోగులను వంచించటమే అవుతుందని అన్నారు. ఆ దేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని గతంలో ఇచ్చిన హామీ హామీని అమలు జరపాలని అదేవిధంగా రిటైర్మెంట్ అయ్యే ఉద్యోగులకు వారసత్వ హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు. అందుకొరకు కొత్త జీవో ఉత్తర్వులను ఇవ్వాలని , అదేవిధంగా సమ్మె కాలపు వేతనాలను, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వేతనాలను పెంచి ఉద్యోగులకు కనీస వేతనాలు కల్పించి సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా శిబిరం వద్దకు వచ్చిన ఐసిడిఎస్ పిడి మెమోరాండం తీసుకొని ప్రభుత్వానికి నివేదిక పంపి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కే దేవగంగు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జై శంకర్ గౌడ్, అంగన్వాడి జిల్లా కోశాధికారి పి చంద్రకళ, ఉపాధ్యక్షులు సూర్య కళ, శివరాజమ్మ, కరుణ, నాయకులు ఎలిజబెత్ రాణి, విజయ , జ్యోతి, సందీప,, సరిత, గోదావరి, లక్ష్మి,, అరుణ, తదితరులతోపాటు అంగన్వాడీ ఆయాలు టీచర్లు పాల్గొన్నారు.



సర్కారు ఆచితూచి అడుగులు..

బీసీ జన గణన చేపట్టిన తర్వాతే గ్రామపంచాయతీ ప్రాదేశిక రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలు చేపట్టాలని ఓవైపు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు చర్చ జరుగుతుంది. ఇదిలా ఉండగా గత ఎన్నికలు జరిగినప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లు పదేళ్లపాటు కొనసాగాలని అప్పటి ప్రభుత్వం చట్టం రూపొందించింది. కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఏ మేరకు నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. మరి స్థానిక సంస్థల ఎన్నికలు వరుస క్రమంలో రానుండగా వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పథకాల అమలులో సర్కారు ఆచితూచి అడుగులు వేస్తుంది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అనుకున్న స్థానాలు గెలువకపోవడంతో కొంత నిరుత్సాహంలో ఉన్నారు. దీంతో ఎన్నికలు ఆలస్యంగా నిర్వహించే అవకాశం కనిపిస్తుంది.1

స్థానిక సంస్థల్లో సైతం

ప్రత్యేకాధికారుల పాలన

- నేటితో ముగియనున్న ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుల పదవీకాలం
- జడ్పీకి కలెక్టర్, మండలాలకు వివిధ శాఖల అధికారులు
- జిల్లా అధికారుల కేటాయింపునకు కసరత్తు

నవతెలంగాణ-ఆర్మూర్

మండల పరిషత్ జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం నేటితో పూర్తి కానుంది.. వీరి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించి కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 4తో ముగియాగా గ్రామ పంచాయితీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. కాగా ఇటీవల జరిగిన ఎన్నికలకు వారి ఆధ్వర్యంలోనే ప్రస్తుతం అన్ని కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. పంచాయితీ రాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల సభ్యుల పదవీకాలం ముగిస్తే ఆ ఎన్నికలు జరిగేంత వరకు ప్రత్యేక అధికారులను నియమించి కార్యకలాపాలను కొనసాగించాలి. తమ పాలన కాలాన్ని పొడిగించాలని ఎంపీటీసీలు, జడ్పిటిసి సభ్యుల నుంచి డిమాండ్ వినిపిస్తుది.

అమలులోకి ప్రత్యేక అధికారుల పాలన..

మండల పరిషత్ అధ్యక్షులు పదవీకాలం నేటితో ముగియనుండగా, శుక్రవారం నుండి ప్రత్యేక అధికారుల పాలన అమలులోకి వస్తుంది. జిల్లా వ్యాప్తంగా 27 మండలాలు ఉండగా ఒక్కో మండలానికి ప్రత్యేక అధికారి రానున్నారు. వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించేందుకు కసరత్తులు ముమ్మరం చేసినారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో..



నాపైన నమ్మకముంచి మచ్చర్ల ఎంపీటీసీగా గెలిపించిన గ్రామ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటా. ఎంపీపీ కావడానికి రాజ్యాంగం ద్వారా హక్కు కల్పించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆయన ఆశయా సాధనలో నావంతు కృషి చేస్తాను.

పస్కా నరసయ్య ,ఎంపీపీ,ఆర్మూర్.

జిల్లాలో..

జిల్లా వ్యాప్తంగా 27 జడ్పిటిసి, 299 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జడ్పిటిసి సభ్యుల పదవీకాలం శుక్రవారంతో, ఎంపీటీసీ సభ్యుల గడువు నేటితో ముగియనుంది.

1960 సంవత్సరం నుండి..

జిల్లా పరిషత్‌కు ఇప్పటివరకు 13 మంది కలెక్టర్లు ప్రత్యేక అధికారులుగా పనిచేశారు. 1960లో మొదటి చైర్మన్‌గా సిహెచ్ హనుమంత్ రెడ్డి పనిచేయగా, జిల్లా పరిషత్ ఆవిర్భావం నుండి 28 మంది చైర్మన్లు, 13 మంది ప్రత్యేక అధికారులుగా పనిచేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఇద్దరు కలెక్టర్లు ప్రత్యేక అధికారులుగా పని చేయగా, ప్రస్తుతం జిల్లా పరిషత్ పాలకవర్గం ఏర్పడే వరకు మూడవ ప్రత్యేక అధికారిగా రానున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా పరిషత్‌కు కొత్త సభ్యులు ఎన్నిక అయ్యేంత వరకు కలెక్టర్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలను చేపట్టనున్నారు.. ఆయన ఆధ్వర్యంలోనే కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రస్తుతం అదనపు కలెక్టర్ స్థాయిలో సీఈవో ఉన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం జడ్పీకి వచ్చే నిధుల వినియోగంతో పాటు మండలాల కేటాయింపు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఇతర ఇంజనీరింగ్ శాఖల ద్వారా పనులు చేపట్టడంతో పాటు నిధులను ప్రత్యేక అధికారుల ద్వారానే ఖర్చు చేయనున్నారు. మండల స్థాయిలో ఎంపీడీవో ల ఆధ్వర్యంలో పనులను పూర్తి చేయనున్నారు. అయితే ప్రత్యేక అధికారి నియామకం తర్వాత కలెక్టర్ ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు కొనసాగనున్నవి.

నేటి వామపక్షాల నిరసన ప్రదర్శనను

జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న సిపిఐ(ఎంఎల్) నాయకులు

బొగ్గు గనుల వేలం, నీట్ పరీక్ష అవకతవకలపై వామపక్ష పార్టీల రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు అమలుకై ఎన్ఆర్ భవన్, కోటగల్లీలో జిల్లాలోని వామపక్ష పార్టీల సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వనమాల కష్ణ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 61 బొగ్గు గనులను వేలం వేసేందుకు కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష నీట్ లీకేజీతో రూ.24లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేసిందని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ అవకతవకలు, బొగ్గు గనుల వేలంను నిరసిస్తూ వామపక్ష పార్టీలు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 5న జిల్లా కేంద్రంలోని ధర్నా చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. ఈ పిలుపును జయప్రదం చేయాలని కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావులకు పిలుపునిచ్చారు. ఈ ప్రెస్‌మీట్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, ఎంసిపిఐ(యు) జిల్లా బాధ్యులు శ్రీనివాస్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నగర కార్యదర్శి ఎం.సుధాకర్, ఏఐఎఫ్డీఎస్ బాధ్యులు ఎం.రాజశేఖర్, పిడిఎస్‌యు బాధ్యులు జే.రాజేశ్వర్లు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో తరగతులు షురూ

- ఇంటర్ నోడల్ అధికారి సలాం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభించినట్లు జిల్లా ఇంటర్ కళాశాల నోడల్ ఆఫీసర్ షేక్ సలాం పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కళాశాల తరగతులు ప్రారంభించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించారు. జిల్లావ్యాప్తంగా 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇప్పటివరకు 1700 మంది ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ అయినట్లు ఆయన తెలిపారు. అన్ని కళాశాలలో తరగతులు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఈనెల 31వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 9,000 మంది విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు.



విద్యార్థులకు బుక్స్‌ను అందజేస్తున్న పలువురు

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడు తరగతి గదులు ఏర్పాటు చేసి విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. తరగతులు ప్రారంభం కావడంతో విద్యార్థులకు బుధవారం రోజు ఎంపీపీ టేకులపల్లి వినీత జడ్పిటిసి మనోహర్ రెడ్డి ఎంఈఓ వెంకటేశం చేతులమీదుగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు షేక్ సలాం తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపల్ హేమచందర్, నాగిరెడ్డిపేట ఎంపీటీసీ మాధవి, ఆత్మకూర్, ఎంపీటీసీ, మోతే శ్రీనివాస్, చినూర్ ఎంపీటీసీ గుర్రాల సుశీల, మాల్ తుమ్మెద ఎంపీటీసీ పుప్పల నారాయణ ఉన్నారు.

వ్యాపారస్తులకు ట్రేడ్ లైసెన్స్ ఉండాలి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్పేట గ్రామపంచాయతీ పరిధిలో గల వ్యాపారస్తులు 2024 - 25 సంవత్సరముకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేసినట్లు గోపాల్‌పేట్ పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు. లైసెన్స్ కు సంబంధించి మీ సేవ కేంద్రాలలో స్పష్టమైన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లైసెన్స్ తీసుకోకుండా వ్యాపారం నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నోటీసును అందిస్తున్న పంచాయతీ కార్యదర్శి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
గురువారం | జులై 04, 2024 | www.navatelangana.com

భర్త ఇంటిముందు పిల్లలతో ఆందోళన



భర్త ఇంటిముందు పిల్లలతో బైఠాయించిన భార్య

నవతెలంగాణ-ఆర్మూర్

తన భర్త అరవింద్ కుమార్ ఆచూకీ తెలపాలంటూ బుధవారం ఇద్దరు పిల్లలతో భార్య ఆందోళనకు దిగింది. పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో సాత్ పూతే గిర్మాజీ అశ్విని అనే మహిళ బుధవారం భర్త ఇంటి వద్ద బైఠాయించింది. మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని మూడు సంవత్సరాల నుండి తనను దూరం పెడుతున్నాడని ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని, భర్త ఇంట్లోనే ఉండేందుకు వీలు కల్పించాలని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన జోగు నర్సయ్య



నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బుధవారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి బాల్కొండ మాజీ జడ్పీటీసీ సభ్యులు జోగు సంగీత భర్త జోగు నర్సయ్య, ముప్కాల్ మాజీ సర్పంచ్ పృథ్వీవల్లబ్ మాజీ మంత్రి, ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ పార్టీకి సంబంధించిన విషయాలు, బాల్కొండ నియోజకవర్గ ప్రజల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు..

మలేరియాపై నివారణపై అవగాహన



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విస్తరణ అధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల గన్నారం ఆరోగ్య ఉప కేంద్రంలో జాతీయ మలేరియా పై బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ జులైని డెంగ్యూ మాసంగా ప్రకటించడంతో పరిసరాల పరిశుభ్రత, దోమల పెరుగుదల అరికట్టడంలో ప్రజలలో అవగాహన తీసుకురావాలని ఉద్దేశంతో మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన డయేరియా వ్యాధులు సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. నీరు నిల్వ ఉండడం వలన దోమలు పెరిగే అవకాశం ఉంటుందని, దోమలు పెరగకుండా దోమల నివారణ కార్యక్రమాలు గ్రామస్థాయిలో చేపట్టాలని, నీటి నిల్వలను గుర్తించి గ్రామ కార్యదర్శికి నివేదిక ఇవ్వాలని ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది శారద, ఇందిరా, ఆనంద్, స్రవంతి, ఆశాకార్యకర్త షకీనా, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

శ్రీ శివ సాయిబాబా మందిర్ వివి నగర్ కాలనీ ఆలయ కమిటీని ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బంగారు గంగారం, రఘువీర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విశ్వజిత్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా కోటేశ్వరరావు, కోశాధికారిగా శ్యాంసుందర్, సలహాదారులుగా ఆంజనేయులు, భూపాల్ రెడ్డి, రామచందర్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ శివ సాయిబాబా మందిర్ వివి నగర్ కాలనీ ఆలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అమర్జిత్ రెడ్డి, గంగారం, తదితరులు పాల్గొన్నారు.

దీక్షను విజయవంతం చేయాలి

- జిల్లా అధ్యక్షులు సల్లూరి శ్రీనివాస్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ కంఠేశ్వర్

ఎస్సీ వర్గీకరణ కోసం హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి టి.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ ఈనెల 7న చేసే దీక్షను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు సల్లూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం దీక్షకు సంబంధించిన కరపత్రాలను నిజామాబాద్ నగరంలో జిల్లా అధ్యక్షులు సల్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి మాట తప్పడం వలన ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్లో చట్టబద్ధత కల్పించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ హైదరాబాదులోని ఇందిరాపార్క్‌లో దీక్ష చేపట్టారని తెలిపారు. ఆ దీక్షను మాదిగ, మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు సల్లూరి శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు జిన్నారం రవి, కిన్నెర అనురాధ, నక్క రమేష్ నారాయణ, సౌజన్య, సాయిబాబా, సాల్మన్, నరసమ్మ, ఎల్లమ్మ, పోసాని, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బడి బాటలో భాగంగా మండలస్థాయిలో ఏక రూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్ పల్లి ప్రైమరీ పాఠశాల లో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ నర్సయ్య, వైస్ ఎంపీపీ సాయిలు , ఎంపిడిఓ రవీందర్, తహసిల్దార్ ప్రభాకర్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలన్నారు. మధ్యాహ్న భోజనం దుస్తులు పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సౌమ్య సుధీర్, సొసైటి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ నవీన్, ఎపిఎం రజిత రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సంధ్య నాయక్, రాజ్య లక్ష్మి, సంగీత, నాయకులు ధర్మా గౌడ్, నరేందర్ రెడ్డి , శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్, రాజన్న, శంకర్ పాల్గొన్నారు

అభివృద్ధికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు



నిజామాబాద్ రూరల్: ఎంపీటీసీలను సన్మానించిన పలువురు



సిరికొండలో...



కమ్మర్‌పల్లిలో...

- ఎంపీటీసీలకు ఘనంగా వీడ్కోలు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ మండలం ఎంపీటీసీలు అందరం కలిసి అన్నదమ్ములా ఉండి మండల అభివృద్ధికి పాటుపడ్డామని ఎంపీపీ అనూష ప్రేమ్ నాయక్ అన్నారు. జడ్పిటిసి సుమలత గోపాల్ రెడ్డి అన్నారు. అభివృద్ధికి సహకరించి సంజీవ్ మాజీ ఎంపీడీవో లేకపోవడం చాలా బాధాకరమని పాల్ద ఎంపీటీసీ నరేష్ అన్నారు. పదవులు ముఖ్యం కాదు.. మా పదవీకాలంలో చేసిన పనులు ముఖ్యం అని గుండారం ఎంపీటీసీ అంకం గంగాధర్ తెలిపారు. తమ పదవీకాలంలో ఎంపీఓగా మధురిమ ఉండడం, ఇప్పుడు ఎంపీడీవో కావడం నిజామాబాద్ రూరల్ మండలం అదృష్టమని ఎంపిటిసిలు అన్నారు. పాలనలో పాల్ద గ్రామానికి అవార్డు రావడం మా ప్రత్యేకమని అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని నిజామాబాద్ రూరల్ మండలం ఎంపీటీసీలకు ఎంపీపీ, జడ్పిటిసిలకు వారి పదవీకాలం ముగిసిన సందర్భంగా ఎంపీడీవో మధురిమ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పాల్ద ఎంపీటీసీ ఆమని నరేష్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న..లేకున్నా ప్రజలకు కచ్చితంగా సేవలు చేస్తామని, అందుబాటులో ఉంటామని తెలిపారు. పాల్ద గ్రామానికి జాతీయ స్థాయిలో అవార్డు రావడం గర్వకారణంగా ఉందని అన్నారు. ఎంపీఓ మహేష్ అందరినీ వేదికపైకి ఆహ్వానించారు. అనంతరం రాంనగర్ ఎంపీటీసీ నీరజ స్వామి మాట్లాడుతూ శాంతినగర్ గ్రామానికి, శ్రీనగర్ గ్రామపంచాయతీ లుగా ఏర్పడడం మా విజయంగా భావిస్తున్నామని అన్నారు. గుండారం ఎంపీటీసీ అంకం గంగాధర్ మాట్లాడుతూ.. నా ఈ రాజకీయ ప్రస్థానంలో పది సంవత్సరాలు పైగా రాజకీయంలో ఉన్నానంటే మా గురువు గుండారం సర్పంచ్ లక్ష్మణ్ రావు గారని కొనియాడారు. ఎంపీడీవో నరేష్ ఉన్నప్పుడు ఎంతో సహకరించారని అన్నారు. ప్రతీ అధికారి సహకరించారని తెలిపారు. సర్పంచ్ లక్ష్మన్ రావు సారథ్యంలో గుండారం గ్రామానికి అవార్డు రావడం తమ కష్టానికి నిదర్శనం అన్నారు. అనంతరం గుండారం సర్పంచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ .. తన గుండారం ఎంపీటీసీ గంగాధర్ నన్ను గురువు అన్నందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎంపీపీ అనూష ప్రేమ్ నాయక్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో 90 శాతం పనులు పూర్తి చేశామని, అందరం కలిసికట్టుగా మండల అభివృద్ధికి కృషి చేశామని అన్నారు. కొందరు ఎంపీటీసీలకు 5 నుంచి 8 లక్షల వరకు ప్రొసిడింగ్స్ కాపీలు ఉన్నాయవి ఇప్పించాలని ఎంపీడీవోను కోరారు. అనంతరం ఎంపీడీవో మధురిమ మాట్లాడుతూ పదవి కాలంలో మీరు మాకు అందరూ సహకరించారని, భవిష్యత్తులో కూడా సహకరిస్తామని చెప్పారు. అనంతరం జడ్పిటిసి సుమలత గోపాల్ రెడ్డి మాట్లాడుతూ నాకు రాజకీయంలో ఓనమాలు తెలియవని, కానీ ఇంత పెద్ద పదవి కట్ట పెట్టినందుకు గ్రామ ప్రజలకు శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నానని అన్నారు. అధికారంలో లేకున్నా ఇంకా మేము ప్రజలలో ఉంటామని తెలిపారు. అనంతరం ఎంపిటిసిలకు పూలబొకే శాలువాతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు గుండారం ఎంపీటీసీ అంకం గంగాధర్, ఎంపీపీ అనూష ప్రేమ్ నాయక్, జడ్పిటిసి సుమలత గోపాల్ రెడ్డిని గ్రామాల నుండి పెద్ద ఎత్తున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ సెక్రెటరీ, గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిరికొండ: సిరికొండ వైస్ ఎంపీపీ తోట రాజగంగయ్య పదవీకాలం ముగుస్తుండడంతో ఘనంగా సన్మానించారు. బుధవారం మండల కేంద్రంలోని రావుట్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో వైస్ ఎంపీపీ తోట రాజగంగయ్యని ప్రత్యేక అధికారి, తహసీల్దార్ రవీందర్‌రావ్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గణేష్, కారోబార్ రాజబాబు, గ్రామపంచాయతీ సిబ్బంది, బాబన్న డైరెక్టర్, అంగన్వాడీ టీచర్లు, హెల్త్ వర్కర్స్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల అభివృద్ధికి సహకరించిన మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి అన్నారు.కమ్మర్ పల్లి మండల ప్రజా పరిషత్ పాలకవర్గం పదవి కాలం నేటితో ముగియనున్న నేపథ్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు సంవత్సరాలుగా మండలంలో ఎంపీపీ, జడ్పీటీసీ ఎంపీటీసీలుగా సేవలందించిన ప్రజా ప్రతినిధులకు మండల అన్ని శాఖల అధికారుల ఆధ్వర్యంలో సగౌరవంగా వీడ్కోలు సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ అధ్యక్షురాలు గౌతమి మాట్లాడుతూ... ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి సహకారంతో ఎంపీపీ అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టి ఐదు సంవత్సరాల పదవికాలాన్ని దిగ్విజయంగా పూర్తి పూర్తి చేసుకోవడం సంతృప్తికరంగా ఉందన్నారు. అభివృద్ధి కోసం మండలానికి కావాల్సిన నిధులను అడిగిన వెంటనే సమకూర్చిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మండల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.

ప్రజా ప్రతినిధుల సేవలు మరువలేనివి... తహసిల్దార్, ఎంపీడీవో

మండల పరిషత్ లో ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపిటిసిల సేవలు అమూల్యమైనవని తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. పదవులు శాశ్వతం కాదని, పదవిలో ఉన్నప్పుడు మన ప్రవర్తనే పలువురికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి హాజరై వారు మాట్లాడారు. పదవులు, పదవిలో ఉన్నప్పుడు ప్రజలకు అందించే సేవలే కొలమానం అని అన్నారు. అధికారులతో మర్యాదపూర్వకంగా మసులుకొంటూనే మండల అభివృద్ధికి, లబ్ధిదారులకు అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేశారని అధికారులు కొనియాడారు. అనంతరం ఎంపీపీ గౌతమి, ఎంపీటీసీ సభ్యులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు కాలేరు శేఖర్, ఎంపీటీసీ సభ్యులు పిప్పర అనిల్, మైలారం సుధాకర్, లగావత్ గంగాధర్, మండల్ కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ హుస్సేన్, నోముల రజిత, దుబ్బాక సుప్రియ, తోట జ్యోతి, బుస్సాపురం సుప్రియ, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, మండల పంచాయతీ అధికారి సదానంద్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ మైలారం గంగాధర్, ఏపిఎం కుంట గంగారెడ్డి, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఐదేళ్ళ పదవీ కాలం ముగింపు సందర్భంగా బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులకు ప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీగా సామ పద్మ విధి నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా పరిపాలన అందించారని ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్ అన్నారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులను శాలుంఇలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్, తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపీవో భరత్ చంద్ర, పరిషత్తు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు శ్రీనివాస్, శంకర్, గౌతమి, రాజ్యలక్ష్మి భరత్ స్వరూప్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు..



ముప్కాల్‌లో...

ప్రీ స్కూల్ విద్యా బోధన చేయాలి

- ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ సిడిపిఓ జానకి

నవతెలంగాణ-ఎడపల్లి



మాట్లాడుతున్న ప్రాజెక్టు సిడిపిఓ జానకి

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారి బాలబాలికలకు ఆటపాటల ద్వారా ప్రీ స్కూల్ నూతన విద్య బోధన చేయాలని ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ సిడిపిఓ జానకి అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎడపల్లి, రెంజల్ మండలాలకు చెందిన అంగన్వాడీ టీచర్లకు ఏర్పాటుచేసిన నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా రివైజ్ ప్రీ స్కూల్‌పై మూడు రోజుల శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ జానకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిక్షణ ప్రధాన ఉద్దేశం పిల్లలను సమగ్ర సంపూర్ణ వికాసవంతులుగా తీర్చిదిద్దడంలో అంగన్వాడీ ఉపాధ్యాయుల పాత్ర చాలా ఉందన్నారు. ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 9 శిక్షణ తరగతుల బ్యాచ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మొట్టమొదటిసారిగా మండలాల అంగన్వాడీ ఉపాధ్యాయులకు నూతన విద్యా విధానం, ప్రీ స్కూల్ అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. మూడు సంవత్సరాల పిల్లల నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ల జూన్ నుంచి సెప్టెంబర్ వరకు, అక్టోబర్ నుంచి జనవరి వరకు, జనవరి నుంచి ఏప్రిల్ వరకు మూడు దశలవారీగా కర దీపిక, ప్రియదర్శిని పుస్తకాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో, ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ ఎడపల్లి, రెంజల్ మండలాల సూపర్వైజర్లు విజయ రాణి, ప్రమీల, జిల్లా పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ రాంబాబు, శిక్షణ ఉపాధ్యాయులు ఆసియా బేగం, రాధ, అంగన్వాడీ కేంద్రాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

- వీహెచ్‌పీఎస్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న నాయకులు

వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో జూలై 5న చేపట్టే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్‌పి జిల్లా కోఆర్డినేటర్ పోశెట్టి, వీహెచ్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్, విహెచ్పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పి జిల్లా కోఆర్డినేటర్ పోశెట్టి మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో చేయూత పథకం ద్వారా పింఛన్లు పెంచుతామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. 5వ తేదీ లోపు పింఛన్ పెంపు తేదీని వెంటనే ప్రకటించాలని, లేకపోతే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఆరు నెలలు గడిచినా పింఛన్లు పెంచక పోవడమంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పింఛను దారులను విస్మరించడమే అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే 3 రోజుల్లో పింఛన్లు పెంచారని, కానీ మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం చేయూత పథకం అమలు చేయడం లేదని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువుల వివిధ పింఛన్లను పెంచేంతవరకు వారికి ఎమ్మార్పీఎస్ అండగా ఉండి మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా కో ఆర్డినేటర్ సరికల పోశెట్టి మాదిగ, వి హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ, విహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు బీరప్ప, ఎంఎంఎస్ రాష్ట్ర నాయకురాలు యమున, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లసింగారి భూమయ్య మాదిగ,ఉపాధ్యక్షులు రొడ్డ ప్రవీణ్ మాదిగ, ఎం ఎస్ పి జిల్లా నాయకులు రాములు మాదిగ, విహెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సలీం, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు మహేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

జీలుగ సాగుతో భూసారం వృద్ధి

- ఏవో మహేందర్ రెడ్డి



పంటను పరిశీలిస్తున్న ఏవో

నవతెలంగాణ-బాల్కొండ

జీలుగా సాగుతో భూసారం వృద్ధి చెందుతుందని ఏవో మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో పచ్చి రొట్టెపైరైన జీలుగపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు కొన్ని సూచనలు చేశారు. పచ్చి రొట్టెపైరైన జీలుగా జనుము విత్తనాలను ప్రభుత్వం రాయితీపై రైతులకు అందజేస్తుందని తెలిపారు. వరి వేసే మాగానుల్లో మే నెల చివరిలో విత్తనాలు చల్లుకొని ఈ పచ్చిరొట్టె పైరును సాగు చేసుకోవాలన్నారు. ఒక ఎకరంలో పండించిన పచ్చి రొట్టెపైరైన జీలుగను నేలలో తొక్కించడం ద్వారా 40 నుంచి 60 టన్నుల సేంద్రీయ పదార్థాన్ని భూమికి అందించవచ్చు అన్నారు. ఈ సేంద్రియ పదార్థం ద్వారా భూమిలో నట్టలు, సూక్ష్మజీవులు పెరిగి పోషకాల లభ్యత పెరుగి తద్వారా పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడులను 25 శాతం మేర సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ నిహారిక, రైతులు పాల్గొన్నారు.

14న బోనాల ఉత్సవాలు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో గ్రామ పెద్దలు గ్రామంలో బోనాల పండుగను 14న జరపుకోవాలని నిర్ణయించారు. గ్రామం పాడి పంటలతో, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, వర్షా కాలం ప్రారంభంలో చేసుకునే అందరి పండుగ అని తెలిపారు.

రూ.4.80 లక్షలకు తైబజార్ వేలం



తైబజార్ వేలానికి హాజరైన పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో బుధవారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి నరేష్ ఆధ్వర్యంలో తైబజార్ వేలం నిర్వహించినట్టు గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ తెలిపారు. గ్రామస్తుల సమక్షంలో 2024-25 సంవత్సరం గాను 9 నెలలు తైబజార్ వేలం నిర్వహించగా లింగంపేట గ్రామానికి చెందిన హర్షద్ పాషా 4 లక్షల 80 వేల రూపాయలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ వేలం కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇంచార్జి ఎంపీవోగా వెంకట సత్యనారాయణరెడ్డి

నవతెలంగాణ-పిట్లం

మండల పంచాయతీ ఇన్చార్జి అధికారిగా వెంకట సత్యనారాయణరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం బాన్సువాడ పంచాయతీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వర్తించిన బ్రహ్మం గత నెల 30న పదవి విరమణ చేయడంతో వెంకట సత్యనారాయణ రెడ్డిని ఇన్చార్జి ఎంపిఓ నియామించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, ఏపీవో శివకుమార్, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన వెంకట సత్యనారాయణరెడ్డి

చిన్న, సన్నకారు రైతులకే 'రైతు భరోసా' కల్పించాలి

- పది ఎకరాల్లోపు రైతులకు మాత్రమే అమలు చేయాలి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్/మద్నూర్/బిచ్కుంద

సన్న, చిన్నకారు రైతులకే రైతు భరోసా పథకం అమలు చేయాలని పలువురు రైతులు సూచించారు. మండలంలోని రైతు వేదికలో బుధవారం వ్యవసాయ అధికారులు రైతులతో రైతుభరోసా పథకం ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రైతు కిష్టారెడ్డి మాట్లాడుతూఒకటి నుంచి పది ఎకరాల లోపు ఉన్న రైతులకు మాత్రమే రైతు బంధు ఇవ్వాలని సూచించారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతుభరోసా ఇవ్వాలని, గత ప్రభుత్వం గుట్టలకు రోడ్లకు, వెంచర్లకు పెద్ద పెద్ద భూస్వాములకు రైతుబంధు ఇచ్చినట్టు తెలిపారు. వ్యవసాధికారులు రైతుల అభిప్రాయాలను సేకరించి నివేదికను పంపిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారి లక్ష్మీనారాయణ, ఏడిఏ లక్ష్మీ ప్రసన్న, చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మండల అభివృద్ధి అధికారి నదిముద్దీన్, సిఈఓ సందీప్, వ్యవసాయ అధికారులు రూప,సిబ్బందిలు,రైతులు, పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్‌లో మాట్లాడుతున్న రైతులు



మద్నూర్‌లో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు



బిచ్కుందలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

పదెకరాల్లోపు రైతులకు రైతుభరోసా ఇవ్వాలి

మద్నూర్ : మండలంలో రైతు భరోసా పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజా సేకరణ సదస్సును సింగిల్ విండో ఆధ్వర్యంలో రైతువేదిక భవనంలో బుధవారం నిర్వహించారు. పది ఎకరాల వరకు రైతు భరోసా పథకం అమలు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా డిఆర్ ఏఓ ప్రత్యేక అధికారి రామోహన్‌రావు, అలిన్, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అందుబాటులో లేకపోవడం ఈ సదస్సు వైస్ చైర్మన్ శంకర్రావు అధ్యక్షతన జరిగింది. సింగిల్ విండో కార్యదర్శి జే.బాబురావు, మండల వ్యవసాయ అధికారి రాజు, ఏఈఓ ప్రియాంక, సింగిల్ విండో పాలకవర్గం సభ్యులు, రైతులు, పాల్గొన్నారు.

డీఆర్ఏవోకు సన్మానం

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు భరోసా పథకం అమలుపై జరుగుతున్న అభిప్రాయ సేకరణకు బుధవారం కామారెడ్డి జిల్లా డిఆర్ ఏవో రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం సింగిల్ విండో కార్యాలయంలో జిల్లా అధికారికి సింగిల్ విండో పాలకవర్గం అధికార గణం ఆయనకు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సత్కార కార్యక్రమం సింగిల్ విండో పాలకవర్గ వైస్ చైర్మన్ శంకర్‌రావ, కార్యదర్శి జే బాబురావు, పాలకవర్గం సభ్యులు సింగిల్ విండో సిబ్బందితో పాటు మండల వ్యవసాయ అధికారి రాజుకు, జిల్లా ఆడిట్ అధికారి ఆలింకు శాలువలతో ఘనంగా సత్కరించారు.

రైతుభరోసాపై సూచనల స్వీకరణ

బిచ్కుంద : రైతు భరోసాపై రైతులు సూచనలు ఇవ్వాలని సంగారెడ్డి డిఆర్ఏఓ ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి, రైతు సహకార సంఘం అధ్యక్షులు బాలాజీ అన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సాగు చేసే ప్రతి ఎకరా భూమి రైతు బంధు పథకాన్ని వర్తింపజేయాలని పండించిన ప్రతి పంటకు మద్దతు ధర ఇవ్వాలని రైతులు కోరారు. పట్టా పాస్ బుక్ ప్రకారం 10 ఎకరాల వరకు రైతు బంధు ఇవ్వాలని సరైన సమయంలో రైతు భరోసా డబ్బులు రైతులకు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాస్తు చేస్తున్న అసైన్డ్ భూములకు కూడా రైతు బంధు ఇవ్వాలని రైతులకు మేలు చేసే పథకాలను అమలు చేయాలని ఈ సందర్భంగా రైతులు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా మానిటరింగ్ అధికారి లక్ష్మీనారాయణ, వ్యవసాయ డివిజన్ అధికారిని లక్ష్మీపసన్న, సీఈవో శ్రవణ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-పెద్దకొడప్ గల్

మండల కేంద్రానికి చెందిన బర్ద్వల్ అమర్ సింగ్ ఉద్యోగ పదవీ విరమణ చేసి తన స్వంత గ్రామానికి బుధవారం చేరుకున్న సందర్భంగా ఆయనకు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని కాటేపల్లి చౌరస్తా నుండి ఆయనకు కుటుంబ సభ్యులు నుదుట తిలకం దిద్ది పూల మాల వేసి శోభ యాత్ర నిర్విహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాటశాల వద్ద విద్యార్థులు ఉపాధ్యాయులు జై జవాన్ అనే నినాదాలు చేయడంతో ఆయన అభివాదం చేస్తు శోభ యాత్ర ముందుకు సాగుతు ఆయన స్వగృహానికి చేరింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సౌదగర్ గంగారాం మాట్లాడుతూ అమర్ సింగ్ భారత సైన్యంలో చేరి నేటికి 39 సంవత్సరాలు పూర్తి చేసుకొని పదవి విరమణ చేసుకుంటునందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.



స్వాగతం పలుకుతున్న పలువురు

ఏఈకి సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణానికి చెందిన లక్ష్మీనారాయణ విద్యుత్ శాఖ ఏఈగా బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. చిన్ననాటి స్నేహితుడు పదవి విరమణ పొందడంతో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజమౌళి పదవి విరమణ పొందిన చిన్ననాటి స్నేహితుడు లక్ష్మీనారాయణ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నీలం రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



చిన్ననాటి స్నేహితుడికి సన్మానం

ఇన్సూరెన్స్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండల కేంద్రానికి చెందిన బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్త జనార్ధన్ రెడ్డి, వారి సతీమణి కొన్ని నెలల క్రితం పద్మజీవాడి ఎక్స్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు వారికి ఇన్సూరెన్స్ పాలసీ కట్టి, ఏదైనా ప్రమాదంలో కార్యకర్త దురదృష్ట వశాత్తూ చనిపోతే వారి కుటుంబాలను ఆదుకునేందుకు ఇన్సూరెన్స్ ద్వారా ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయలను అందజేస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే సురేందర్ తెలిపారు. బుధవారం జాజాల సురేందర్.. బాధిత కుటుంబ సభ్యులకు నాలుగు లక్షల రూపాయల చెక్కులను అందించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మండల అధ్యక్షుడు బొలిపల్లి మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

నవతెలంగాణ-లింగంపేట్

విద్యార్థులకు పౌష్టికా హారం అందించాలని లింగంపేట మండలం అభివృద్ధి అధికారి నరేష్ ఉపాధ్యా యులకు సూచించారు. బుధవారం లింగంపేట్ మండలంలోని బాణాపూర్ ఉన్నత పాఠశాలలో ఆయన సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. వంట గదిలోకి వెళ్లి విద్యార్థులకు ఏ రకాల వంటలు చేస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం రావడంతో విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలన్నారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-పిట్లం

సైబర్ నేరాలు, నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో సైబర్ జాగృతి దివాస్ సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు అకౌంట్, ఆధార్ నెంబర్ల సమాచారం అడిగిన ఇవ్వరాదన్నారు. రద్దీగా ఉండే ప్రయాణ ప్రాంగణంలో, బ్యాంకులలో జాగ్రత్తలు పాటించి తమ వస్తువులు, డబ్బులను జాగ్రత్త ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సాయాగౌడ్, రవిచంద్రగౌడ్, మహేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పరీక్షలు వాయిదా వేయాలని వినతి

నవతెలంగాణ-భిక్కనూర్

తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ పరంగానం పరిధిలో ఈనెల 15వ తేదీ నుండి నిర్వహించే పీజీ ఎం ఈ డి సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని బిటిఎస్ వద్ద ఉన్న సౌత్ క్యాంపస్ విద్యార్థులు వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్ కి బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ డీఎస్సీ, గ్రూప్స్ పోటీ పరీక్షలు ఉన్న కారణంగా ఆగస్టు వరకు పరీక్షలను వాయిదా వేయాలని వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ క్యాంపస్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామి అయ్యప్ప సేవా సమితి, అన్నప్రసాద సేవా సమితి ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్వామి అయ్యప్ప సేవా సమితి, అన్నప్రసాద సేవా సమితిలను ఏకగ్రీ వంగా బుధవారం ఎన్నుకున్నారు. స్వామి అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షులుగా గందె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గోనె శ్రీనివాస్, కోశాధికారిగా సోమిశెట్టి నారాయణ ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. దీంతోపాటు అన్నప్రసాద సేవా సమితి అధ్యక్షులుగా విశ్వనాధుల రాజేందర్, కార్యదర్శిగా బాస రఘుకుమార్, కోశాధికారిగా మోటుకూరి శ్రీనివాస్‌లు ఎన్నిక అయనట్లు ఎన్నికల అధికారులు ధ్రువీకరించారు. ఎన్నికల అధికారులుగా కైలాస్ శ్రీనివాసరావు, శని శెట్టి గౌరీశంకర్ నిర్వహించారు.



ఎన్నికైన కమిటీ

పెండింగ్‌లో ఉన్న ఫీజ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

- ఏబీవీపీ ఆధ్వర్యంలో భిక్షాటన

నవతెలంగాణ-కామారెడ్డి

పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో బిక్షాటన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కన్వీనర్ రోహిత్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద విద్యార్థు లకు స్కాలర్షిప్‌లు రాక కళాశాల యాజమాన్యం ఫీజులు కట్టాలని ఇబ్బందికి గురి చేస్తున్నారని తెలిపారు. సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ విషయం ప్రభుత్వానికి తెలిసేలా ఈ బిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించమన్నారు. ఇప్పటి కైనా వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్కాలర్షిప్ లను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, నాయకులు అల్తాఫ్, ప్రత్యూష, మానస, ప్రణీత, బలరాం, రాజు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నీటి తొట్టి పరిశుభ్రం

నవతెలంగాణ-మద్నూర్

గ్రామంలో పరి శుభ్రత పట్ల ప్రత్యేకాధికారులు చేపడుతున్న చర్యలకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలోని రథం గల్లి ప్రాంతంలో గల పశువుల నీటి తొట్టిని అధికారుల ఆదేశాల మేరకు బుధవారం శుభ్రం చేశారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా మండల అభివృద్ధి అధికారి రాణి, గ్రామ కార్యదర్శిగా సందీప్ కుమార్ పాలన గ్రామ శుభ్రత పట్ల గ్రామస్తులు అధికారుల పనితీరుపై అభినందిస్తున్నారు.

ఎమ్మెల్యే జన్మదినం పురస్కరించుకొని

రేపు వైద్య శిబిరం

నవతెలంగాణ- జుక్కల్

జుక్కల్ ఎమ్మెలే తోట లక్ష్మీకాంత్‌రావ్ పుట్టిన రోజు సంధర్భంగా ఈ నెల 5వ తేదీనా (శుక్రవారం) క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆఫీస్ సిబ్బంది బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి ప్రముఖ వైద్యులు రానున్న నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

పిచ్చికుక్క దాడి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామంలో 8 మందిపై పిచ్చికుక్క దాడి చేయగా తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం 44వ జాతీయ రహదారి నుండి రామేశ్వర్ పల్లి గ్రామంలోకి ప్రవేశించిన పిచ్చికుక్క.. అటుగా వెళ్తున్న 8 మందిపై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పిచ్చికుక్కను వెంబడించినా కుక్క దొరకలేదు. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఒక్కసారిగా కుక్క దాడి చేయడంతో స్థానికులు భయాందోళనకు గురైయ్యారు. గ్రామస్తులు పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద, కోతుల బెడద లేకుండా చూడాలని తెలిపారు.

మెకానిక్ దినోత్సవం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలో బుధవారం మెకానిక్‌ల దినోత్సవం టు వీలర్ మెకానికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రపంచ మెకానిక్ డే టు వీలర్ సృష్టికర్త గాట్లిబ్ డైమ్లర్ వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు మిఠాయిలు పంపించేశారు. ఈ సందర్భంగా మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాషు మాట్లాడుతూ ప్రభుత్వం మెకానికులకు ఉపాధి కల్పించాలని వారు కోరారు. బ్యాంకు నుంచి సబ్సిడీ రుణాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చంద్రమౌళి, యూసుఫ్, క్యాషియర్ రామకృష్ణ, జాయింట్ సెక్రెటరీ నరేష్, అనిల్, లక్ష్మణ్, సురేష్, శివ, సుర్జిర్యాల్, రాజ్ కుమార్ సురేష్ మెకానిక్ లు ఉన్నారు.

భారత్ బంద్ విజయవంతం చేయాలి

- నియోజకవర్గ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షులు సర్దార్ నాయక్

నవతెలంగాణ-గాంధారి/ఎల్లారెడ్డి

నీట్ కౌన్సెలింగ్ జరిపే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ ఎల్లారెడ్డి నియోజకవర్గ అధ్యక్షులు సర్దార్ నాయక్ డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలతో కలిసి నేడు తలపెట్టిన భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, పేపర్ అమ్ము కోవడంపై కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం దారుణమని, 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుంటుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షలపై నమ్మకం లేకుండా పోతుంది. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అమ్ముకోవడంపై సాక్ష్యాలు ఉన్నా, నిజమని తేలిన ఎందుకు మౌనంగా ఉంటుందని అయినా 6వ తేదీ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని మొండిగా వ్యవహరిస్తుంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్' చేశారు.

గుర్తిండిపోయేలా సేవలు

ఎంపీటీసీలకు, జడ్పీటీసీలకు సన్మానం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్/గాంధారి/సదాశివనగర్

ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో బుధవారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలకు వీడ్కోలు సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపేటలో ఎంపీపీ టేకులపల్లి వినీత తో పాటు తోటి ఎంపీటీసీలు మోతే శ్రీనివాస్, మాధవి, సుజాత, గుర్రాల సుశీల, ఊర లావణ్య, పుప్పల నారాయణ లకు జడ్పిటిసి మనోహర్ రెడ్డి శాలువాలతో సత్కరించారు. గత ఐదు సంవత్సరాలుగా ఎంపీటీసీలు గ్రామాలలో తమ వంతు సహాయ సహకారాలు ప్రజలకు గుర్తుండిపోయేలా చేశారని ఆయన అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వెనువెంటనే సమస్యల పరిష్కారానికి ఎంపీటీసీలు ఎంతో కృషి చేశారని ఆయన అన్నారు. జిల్లాలో ఎక్కడి లేనివిధంగా ఎంపీపీ తోపాటు ఎంపీటీసీలతో కలిసి జడ్పిటిసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఏ డి ఏ వీరస్వామి, ఎంపీడీవో పరబన్న, ఎంఈఓ వెంకటేశం, ఏపిఎం జగదీష్, మెడికల్ ఆఫీసర్ సుజన్ కుమార్, ఏవో విజయ్ శేఖర్, ఏపీఓ సాయిలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల నోడల్ ఆఫీసర్ షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.





నాగిరెడ్డిపేట్‌లో ఎంపీటీసీలను సన్మానించిన జడ్పీటీసీ.. గాంధారిలో..

పాలకవర్గ సభ్యులకు ఘన సన్మానం వీడ్కోలు

గాంధారి : గాంధారి మండల పరిషత్ కార్యాలయంలో జడ్పిటిసి ఎంపీపీ ఎంపీటీసీలను కార్యాలయ సిబ్బంది సన్మానించారు. జడ్పిటిసి శంకర్ నాయక్, ఎంపీపీ రాధా బలరాంతో పాటు ఎంపీటీసీలను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో గాంధారి ఎంపిటిసి సభ్యుడు తూర్పు రాజు మండల కోఆప్షన్ నెంబర్ ముస్తఫా గౌరారం, ఎంపీటీసీ సభ్యుడు అంజయ్య పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు ఘన సన్మానం

సదాశివనగర్ : ఎంపీటీసీ సభ్యులుగా ఎంతో చేయాలనే సంకల్పంతో ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందామని, గ్రామాల్లో ఉన్న ఎన్నో సమస్యలు పరిష్కరించామని సదాశివనగర్ మండల ఎంపీటీసీ సభ్యులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సంతోష్ కుమార్ ఆధ్వర్యంల ఎంపిటిసి సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేండ్లుగా సహకరించిన ప్రజలకు రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగసాగర్, ఎంపీఓ సురేందర్ రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మోహినొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో..

మహిళలపై, చిన్నపిల్లలపై దాడులు అరికట్టాలి

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నందు సైబర్ నేరాలపై, మహిళలపై చిన్న పిల్లలపై జరిగే అఘాయిత్యాల కట్టడిపై అవగాహన కల్పించారు. అదే విధంగా కొత్త చట్టాల గురించి అలాగే రోడ్డు ప్రమాదాల నివారణపై గాంధారి ఎస్ఐ ఆంజనేయులు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా సెలవుల్లో ఇంటికి వెళ్ళినప్పుడు మొబైల్ ను వాడకూడదని, ఈ వయసులో మొబైల్ అవసరం లేదని, దానివల్ల జరిగే పరిణామాల గురించి వివరించారు. షీ టీం ప్రాముఖ్యత, పాఠశాల నందు ధైర్యంగా ఉండాలని, పాఠశాల నందు ఎలాంటి సమస్య ఉన్న టీచర్లకు గాని, టీచర్ల ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గణేష్, సిబ్బంది, ప్రిన్సిపాల్ శిల్ప సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

త్రిపుల్ ఐటీకి ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలలో 10/10 మార్కులు సాధించిన విద్యార్థి ఎస్ కే సన త్రిబుల్ ఐటీ బాసరకు ఎంపికైనట్లు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని జంగంపల్లి గ్రామం నుండి త్రిబుల్ ఐటీ కి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గపోశిక్షక్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్‌కే సన

అథ్లెటిక్స్‌లో విజయ్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సబ్ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలు రాజారాం స్టేడియం నాగారంలో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్-10 లాంగ్జింప్, 100 మీటర్ల పరుగు పందెంలో 5వ తరగతి చదువుతున్న విశ్వతేజు రెండు బంగారు పతకాలు, అండర్-12 విభా గంలో 6వ తరగతి చదివే ప్రద్యుమ్నకు కాంస్య పతకం, 300 మీటర్ల విభాగంలో 5వ తరగతి చదువుతున్న హార్దికకు కాంస్య పతకం, 100 మీటర్ల విభాగంలో 4వ తరగతి చదువుతున్న వరుణ్కు కాంస్య పతకం లభించాయి. వీరిని బుధవారం పిఈటీ లు స్రవంతి, పద్మలతలను విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత పాఠశాలలో అభినందించారు.

కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ


కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని తొమ్మిది గ్రామాల 49 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు మంజూరైనట్లు మండల తహసిల్దార్ సత్యనారాయణ తెలిపారు. మంజూరైన చెక్కులను స్థానిక రైతు వేదికలో లబ్ధిదారులకు ఎంపీపీ శ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణ పంపిణీ చేశారు. లబ్ధిదారులకు చెక్కుల మంజూరుకు కృషిచేసిన స్థానిక కాంగ్రెస్ నాయకుడు సునీల్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజు పాల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు, అశోక్ ,గోపి, చొక్కాయి గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన ఎస్ఎస్‌యూఐ నాయకులు

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

ఇటీవల భీంగల్ సీఐగా బాధ్యతలు తీసుకున్న నవీన్ కుమార్‌కు ఎన్ఎస్‌యూఐ నాయకులు బుధవారం శాలువా కప్పి స్వాగతం పలికారు. ఇక్కడి యువత నీతిగా నిజాయితీగా ఉంటారని, మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, బాల్కొండ నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు అరుగుల అక్షయ్, జిల్లా ఉపాధ్యక్షుడు రహమాన్, సందీప్, జోహెబ్, గౌరు ప్రశాంత్, దనిష్, సైఫాన్, మొండి దినేష్ తదితరులు కలిసారు.

విరాళం అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ వాస్తవ్యులు ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి దంపతులు అమ్మవారి ఆలయం శుక్రవారం దేవి మందిరానికి రూ 25,011 బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎంపీపీ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎర్రోళ్ల విజయ్, కంచు గంగాధర్, కొమ్ముల మోహన్, గోపు రమేష్, గైని రమేష్, దినేష్, సాయన్న తదితరులు ఉన్నారు.

నేడు పాఠశాలల బంద్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నీట్ పరీక్ష పత్రం లీకేజీ, దేశవ్యాప్త గురువారం జరిగే విద్యాసంస్థల భారత్ బంద్‌లో భాగంగా తెలంగాణ యూనివర్సిటీ బంద్‌కి పిలుపునిస్తున్నామని ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎఐపిఎస్‌యూ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పత్రిక విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీటి పరీక్ష పత్రం లీకేజీపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన వైఖరిని తెలియజేయలేదని, నీట్ పరీక్ష లీకేజికి నిరసనగా నేడు దేశవ్యాప్త విద్యాసంస్థలకు బంద్‌కి పిలుపునిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ యూనివర్సిటి అధ్యక్షులు శ్రీశైలం, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ నాయకులు దినేష్, ఎఐఎస్ఎఫ్ డిచ్‌పల్లి మండల అధ్యక్షులు దినేష్, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, ఎఐపిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ అనిల్, యూనివర్సిటి నాయకులు అక్షయ్, రవీందర్, మోహిత్, వెంకట్ నాయక్, ఆకాశ్, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉషోదయ కళాశాలలో ప్రాంగణ నియామకాలు


ఎంపికైన విద్యార్థులతో కంపెనీ, కళాశాల ప్రతినిధులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 20 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ సూర్య ప్రకాష్ తెలిపారు. టాస్క్ ఆధ్వర్యంలో బహుళ జాతి సంస్థ జెన్ ఫ్యాక్ట్ కొరకు నిర్వహించిన ప్రాంగణా నియామకంల్లో రాష్ట్ర వ్యాప్తంగా 19 కాలేజీలు పాల్గొనగా అందులో 140 మంది విద్యార్థులు హాజరయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఉషోదయ విద్యాసంస్థల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉషోదయ కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఈ ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు సాధించారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉషోదయ విద్యాసంస్థల డైరెక్టర్ దుష్యంత్ టాస్క్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి,జెన్ ప్యాక్ట్ ప్రతినిధి శ్యాంసన్, ప్రిన్సిపల్ గంగాధర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని ప్రైమరీ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో చేపట్టిన పనులను మండల స్థాయి అధికారులు బుధవారం పరిశీలించారు. పాఠశాలలు పున ప్రారంభం కావడంతో ఆ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని వారు ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డి ఈ రాజయ్య, ఎంపీడీవో హెచ్. శ్రీనివాస్, ఎంపీఓ గౌస్ ఉద్దీన్, గ్రామ కార్యదర్శి రాజేందర్ రావు, పంచాయతీ వినయ్ కుమార్, ఉబేద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీకి సన్మానం


ఎంపీటీసీని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని సికింద్రాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో లక్ష్మీ గజేందర్ ఎంపీటీసీ సభ్యురాలిని గ్రామానికి సేవలను అందించి ఐదు సంవత్సరాలు పూర్తి చేసినందుకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆమె చేసిన పనులను గ్రామ విడిసి సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో గంగా మోహన్ ఎంపీఓ, విడిసి అధ్యక్షులు, గణేష్ పంచాయతీ కార్యదర్శి, మాజీ సర్పంచ్, అంగనవాడి కార్యకర్త, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు

ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

- ఎన్‌పీఆర్‌డీ డిమాండ్
- ఆర్డీవో కార్యాలయం ఎదుట వికలాంగుల ధర్నా


ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వికలాగులు

నవతెలంగాణ-బోధన్

వికలాంగుల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట వికలాంగులు ధర్నా నిర్వహించారు .ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏశాల గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు ఎన్నికలలో ఇచ్చినా హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 300 రూపాయల వాటాను 3,000 కు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ 6000కు పెంచాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగాల్లో ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కూడా ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. సదరం సర్టిఫికెట్లు ఎలాంటి షరతులు లేకుండా వెంటనే ప్రతి ఒక్క వికలాంగునికి ఇవ్వాలని, వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, ఇండ్ల స్థలాలు లేని చోట ఇళ్ల స్థలాలు, స్థలాలు ఉన్నచోట ఇల్లు నిర్మించుకోవడానికి కేంద్రం ఐదు లక్షలు, రాష్ట్రం 3 లక్షలు ఇవ్వాలని, భూమిలేని వికలాంగులకు భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ఉపాధ్యక్షులు గైని రాములు, జిల్లా నాయకులు షేక్ నజీర్, జిల్లా నాయకులు రామ్ పటేల్ ,బోధన్ మండల నాయకులు. ఎండి నజీముద్దీన్ , గైని లక్ష్మణ్, సవిత, కవిత, లక్ష్మి, పోషవ్వ, దేవదాసు, వడ్డెన్న ,రాములు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల వ్యాక్సిన్లు పిల్లలకు అందేలా చూడాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్


వ్యాక్సిన్లను పరిశీలిస్తున్న ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్

నవతెలంగాణ కమ్మర్‌పల్లి

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వ్యాక్సిన్లు పిల్లలకు అందేలా చూడాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని చౌట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, హాస కొత్తూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ తరుణ్ తో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రంలో నిల్వ ఉన్న వ్యాక్సిన్ లను, రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంతమంది చిన్నారులకు వ్యాక్సిన్ అందిస్తున్నారని వైద్యాధికారిణి సుప్రియను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా పిల్లలకు అందుతున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లల కోసం 12 రకాల వివిధ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని పిల్లలకు తప్పకుండా అందేలా చూడాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. వ్యాక్సిన్లను నిల్వ ఉంచేందుకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకుని పరిశీలించారు. వాక్సినేషన్ విషయంలో అశ్రద్ధ చూపిస్తే కఠిన చర్యలు ఉంటాయని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సుప్రియ, ఆరోగ్య విస్తీర్ణ అధికారి సత్యనారాయణ, ఫార్మసిస్ట్ రవికుమార్, డిఇఓ మధు, హెల్త్ అసిస్టెంట్ జగదీష్, ఏఎన్ఎంలు శ్యామల, గీత, మమత, తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల టెస్టింగ్‌పై అవగాహన



ఆహార పదార్థాల టెస్టింగ్‌పై అవగాహన కల్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆహార కల్తీ పై కిషన్ గంజ్ లో 'టెస్ట్ చెక్' రామక్రిష్ణ మఠం లో అంగన్వాడీ టీచర్లకు ఆహార కల్తీపై చైతన్య సదస్సు నిర్వహించారు. కిషన్ గంజ్‌లో గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తాన్యా నాయక్ కారంపొడి, కందిపప్పు, వంట నూనెల్లో కల్తీ పై టెస్ట్ చెక్ నిర్వహించారు. ప్రభుత్వం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు కేటాయించిన మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌లో ఆహార కల్తీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం చైతన్య సదస్సులో ఆయన మాట్లాడుతూ కందిపప్పు, కారంపొడిలో ముఖ్యంగా సింథటిక్ కలర్స్, మెటనిల్ ఎల్లో, సూడాన్ కలుపుతారని తెలిపారు. వంట నూనెల పాకెట్‌లపై 'కూకింగ్ ఆయిల్' అని మాత్రమే రాసి ప్యాకింగ్‌పై బొమ్మలు మాత్రం పొద్దు తిరుగుడు, వేరు శనగ వేయడంపై వినియోగదారులు జాగ్రత్త వహించాలని తాన్యా నాయక్ తెలిపారు. జిల్లా మహిళా సంక్షేమ అధికారి డిడబ్ల్యూఓ ఎస్.రసూల్‌బీ మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్‌లకు ప్రభుత్వమే బియ్యం, టెట్రాపాలు, వంటనూనెలు, కారం పొడి, బాలామృతం సరఫరా చేస్తున్నదని, కాబట్టి నాణ్యతలో సమస్యలు లేవని తెలిపారు. బియ్యం మాత్రం కొన్ని ప్రాంతాల్లో నాసిరకంగా ఉన్నాయని తెలిపారు. విజయ డెయిరీ మార్కెటింగ్ ఆఫీసర్ సుమిత్ర విజయ పాల నాణ్యత్‌పై మాట్లాడుతు సదస్సుకు అధ్యక్షత వహించిన వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ అక్రమ లాభార్జనే ధ్యేయంగా జరుగుతున్న వ్యాపారంలో ఆహార కల్తీ సర్వే సాధారణమైపోయిందని, వినియోగదారుల్లో చైతన్యమే శ్రీ రామ రక్ష' అని అన్నారు. పాల లో హానికరమైన కల్తీ హైడ్రోజన్ పెరాక్సైడ్, అమ్మోనియం సల్ఫేట్‌లను అరికట్టలేని పరిస్థితులు లేకుండా చూడాలని ఉన్నతాధికారులను కోరారు. ఫోర్టిఫైడ్ రైస్‌పై మిల్లర్లు, చౌక డిపో డీలర్లు కు అవగాహన కల్పించాలని, లేనట్లయితే కేంద్ర ప్రభుత్వ నిధులు సద్వినియోగం కావని అన్నారు. నేటి నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఆహార కల్తీ పై చైతన్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని సాంబరాజు చక్రపాణి తెలిపారు.

ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు పెందోట అనిల్ కుమార్, సందు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు వి.యస్.వర్మ, సంయుక్త కార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్, గడప రవి కుమార్, బానోతు సందీప్, యాటకర్ల దేవేష్ లింగారెడ్డి, నారాయణలు వివిధ ఆహార పదార్థాలను టెస్ట్ చెక్ నిర్వహించి, వినియోగదారులను చైతన్య పరిచారు.

రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడిపిస్తే జరిమానా

నవతెలంగాణ-రెంజల్

కోట్లాది రూపాయలను వెచ్చించి నిర్మించిన రోడ్డు భవనాల శాఖ, పంచాయతీరాజ్ రోడ్లపై రైతులు కేజీవిల్ ట్రాక్టర్లను నడిపిస్తే మొదటిసారిగా 5000 రూపాయల జరిమానా, రెండవసారి నడిపించినట్లయితే పదివేల రూపాయలతో పాటు, ట్రాక్టర్లు సీజ్ చేయడం జరుగుతుందని పంచాయతీరాజ్ డిఇ రాజయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు, దూపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో రైతులకు కేజీవీల్ ట్రాక్టర్ల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీ ఓ గౌస్ ఉద్దీన్, స్థానిక ఎస్సై ఈ. సాయన్న గ్రామ కార్యదర్శులు రాజేందర్ రవు, సిహెచ్ సాయి, పంచాయతీరాజ్ ఏది వినయ్ కుమార్, రెంజల్, ధూపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైతు భరోసాకోసం ప్రత్యేక మహాజన సభ


మహాజన సభకు హాజరైన పలువురు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని విశాల సహకార పరపతి సంఘ రైస్ మిల్లు ఆవరణలో బుధవారం రైతు భరోసా అమలుకు రైతుల అభిప్రాలని సేకరించాలని ప్రత్యేక మహాజన సభ నిర్వహించారు. రైతులు అభిప్రాయాలను తీసుకొని ప్రభుత్వానికి పంపడానికి, ప్రత్యేక అధికారి జియాద్దీన్, వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో రైతులు తమ అభిప్రాయాలను స్వీకరించారు. సాగు భూమికి మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని, సకాలంలో ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగం చేసే వారికి ఇవ్వవద్దని, పంట నష్టం వెంటనే రైతులకు అందాలని, 5 ఎకరాలకు అని కొంతమంది రైతులు అభిప్రాయం వక్తపరిస్తే, మరికొందరు 10 ఎకరాలకు రైతు భరోసా ఇవ్వాలని అన్నారు. పంటల బీమా గ్రామ పంచాయతీ యూనిట్‌గా తీసుకోవాలని రైతులు కోరారు.

నేటి విద్యాసంస్థల బందును జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆర్మూర్

నేడు జరిగే భారత్ బంద్ ను జయప్రదం చేయాలని ఎన్ ఎస్ యు ఐ,, పిడిఎస్యు, ఏఐఎస్ఎఫ్ నాయకులు కోఆరు. పట్టణ కేంద్రంలో బుధవారం ఐఎఫ్ టి యు కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడిఎస్‌యు డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్ మాట్లాడుతూ దేశంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నీట్ ఎగ్జామ్ పేపర్ లీకై ఫలితాల్లో స్కామ్ జరిగిందని, జూన్ 14న ఎగ్జామ్ రిజల్ట్ ఉండగా ముందుగానే జూన్ 4న రిజల్ట్ ఇచ్చారని తెఉలిపారు. దేశ చరిత్రలోనే మొదటిసారి 67 మందికి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, అందులో ఒకే పరీక్ష కేంద్రంలో 8 మంది విద్యార్థులకు 720 కి 720 మార్కులు రావడం, యూజీసీ నెట్ ఎగ్జామ్ రద్దు కావడం, నీట్ పీజీ పరీక్ష వాయిదా పడడం ఇలా అనేక అనుమానాలకు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ చాయ్ అమ్మినట్లు మాత్రం పేపర్లను అమ్ముతున్నాడని వారు మండిపడ్డారు అన్నారు. దేశంలో దాదాపు 24లక్షల మంది, తెలంగాణ రాష్ట్రంలో 60 వేలకు పైగా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిన ఎన్‌టిఏపై ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటివరకు సరిగ్గా స్పందించకపోవడం దుర్మార్గమని తెలిపారు. తెలంగాణ బీజేపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు దీని పై మాట్లాడకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. కేంద్ర మంత్రులు వెంటనే ఎన్ టి ఏ ను ప్రక్షాళన చేయాలి, నీట్ పేజీ పరీక్షను రద్దు చేసి మరలా నిర్వహించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి జరిగితే ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తారని హెచ్చరించారు. ఈ సందర్భంగానే నేటి భారత్ బంద్ కు పిలుపునివ్వడం జరిగింది అని ఆయన అన్నారు. దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ కు ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధక్షులు శ్రవణ్, ఏఐఎస్ఎఫ్ మండల్ అధ్యక్షులు చోటు, పీ.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు ఎం నరేందర్, వరప్రసాద్, అనిల్, నిఖిల్, సిద్ధు, సాయి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను

పరామర్శించిన ఎమ్మెల్యే


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల, నాగేంద్ర నగర్ గ్రామాల్లో బుధవారం పలు బాధిత కుటుంబాలను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. సాధుల శ్రీనివాస్ వాళ్ళ నాన్న చనిపోవడంతో వారి కుటుంబాన్ని, జిట్టవోయిన రాజు వాళ్ళ నాన్న చనిపోవడంతో ఆయన కుటుంబాన్ని, పడకంటి గంగారెడ్డి వాళ్ళ అమ్మ చనిపోవడంతో వారి కుటుంబాన్ని, బీఆర్ఎస్ నాయకుడు కనుగుర్తి గంగాధర్ చనిపోవడంతో ఆయన కుటుంబాన్ని, నాగేంద్ర నగర్ గ్రామంలో చింతల సతీష్ వాళ్ళ నాన్న చనిపోవడంతో వారి కుటుంబాన్ని, జలీల్ చనిపోవడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బద్దం శ్రీనివాస్, నెరేళ్ళ లింగారెడ్డి, బద్దం ప్రభాకర్, రొక్కెడ మోహన్, బద్దం శ్యామ్, బద్దం హన్మాండ్లు, గడ్డం రమేష్, ఏలేటి బాలకిషన్, బాలాజీ గౌడ్, బద్రి కృష్ణ, కుర్మ శేఖర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై వైద్య శిబిరం


రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి తుకారాం రాథోడ్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులపై వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్ అధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు వైద్య సిబ్బంది, గ్రామ కార్యదర్శి గ్రామంలోని పరిసరాలను పరిశీలించారు. గ్రామంలో డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని పరామర్శించి తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. గ్రామంలోని దోమలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కార్యదర్శికి ఆదేశించారు. జిల్లా పరిషత్ హై స్కూల్ ని సందర్శించి ఉపాధ్యాయులకు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు సీజనల్ వ్యాధుల గురించి, వ్యక్తి గత శుభ్రత, హ్యాండ్ వాష్, దోమల నివారణ చర్యలు గురించి వివరించారు. దోమల పుట్టకుండా కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత గురించి తెలిపారు. గ్రామ కార్యదర్శికి, విడిసికి డెంగీ, చికున్ గున్యా, మలేరియా మొదలైన వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ శిబిరాన్ని పరిస్థితులను బట్టి శిబిరాన్ని కొన్ని రోజులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రకాష్ కుమార్, సిహెచ్ఓ ఆనంద్ కుమార్, ప్రవీణ్ రెడ్డి, భాగ్యలక్ష్మి, నారాయణ, సుజాత, సుధాకర్, సరిత, స్నేహ, శ్రీలేఖ, సూర్యకాంత్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | జులై 04, 2024 | www.navatelangana.com

పరిసరాలు, చేతుల శుభ్రతతోనే వ్యాధుల నివారణ

నవతెలంగాణ-పోతంగల్

డెంగ్యూ మాసం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ పరిసరాల పరిశుభ్రతను బుధవారం పరిశీలించారు. విద్యార్థులందరికి వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. జ్వరాలకు గురికాకుండా ఉండలంటే లార్వా ఎక్కడ ఉండకుండా నిర్మూలన చేయాలని విద్యార్థులకు అవగాహనా కల్పించారు. చేతుల పరిశుభ్రత ద్వారా అనేక వ్యాధులు నివారించటం జరుగుతుందని, కావున ప్రతి రోజు భోజనం ముందు మలవిసర్జన తరువాత చేతులు సబ్బుతో కడుక్కోవాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, హెడ్ మాస్టర్ సాయిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆరోగ్య విస్తరణ అధికారి

ఎంఏ ఎకనామిక్స్ విద్యార్థి సాయికుమార్ కృషి అభినందనీయం..

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ లో ఎంఏ. ఎకనామిక్స్ ఫైనల్ ఇయర్ విద్యార్థి ధర్మపురి సాయికుమార్ ఎస్బిఐలో జూనియర్ అసోసియేట్ జాబు సంపాదించడం అభినందనీయమని తెలంగాణ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పున్నయ్య పేర్కొన్నారు. ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు అందించిన ప్రోత్సాహంతో కష్టపడి చదివి ఈ పోటీ ప్రపంచంలో ఎస్‌బిఐ లో జూనియర్ అసోసియేట్ ఉద్యోగం సాధిచడం గొప్ప విషయమని పేర్కొన్నారు. అనంతరం అర్థశాస్త్ర విభాగం అధ్యాపకులు, విద్యార్థులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సంపత్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ స్వప్న, డాక్టర్ శ్రీనివాస్ డాక్టర్ దత్తహరి, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలోనే రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు

- కేసీఆర్, కేటీఆర్ మతిస్థిమితం లేక మాట్లాడుతున్నారు..
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, గత పదేళ్లుగా కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బీఆర్ఎస్ అభివృద్ధి చేయకుండా కుల. మత రాజకీయాలు చేసి అభివృద్ధి చేయకుండా కాలం వెళ్లదీశారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని చూసి తండ్రి కొడుకులు తట్టుకోలేక మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని కేసీఆర్, కేటీఆర్‌ను విమర్శించారు.. బుధవారం డిచ్ పల్లి మండలంలోని ముల్లంగి గ్రామంలో రూ.12 లక్షలు, నక్కలగుట్ట తండాలో 250 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణానికి 21లక్షలు, మోడల్ కళాశాలలో మరమ్మతులకు 5 లక్షలు, సుద్దపల్లిలో 250 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణానికి 21లక్షలు, అమృత పూర్‌లో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం కు 5 లక్షలు, శివాలయం ప్రహరీ గోడ నిర్మాణం కు 5 లక్షల

వ్యయంతో నిర్మించనున్న పనులను ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేష్ రెడ్డి, ఎంపీపీ చిన్నోల్ల

నర్సయ్య, సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, రాంచందర్ గౌడ్ లతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా పలు చోట్ల ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... భారాస పాలనలో ఎలాంటి అభివృద్ధి చేయకపోగా లక్షలాది రూపాయలను అప్పుచేశారని చెప్పారు. త్వరలోనే రైతులందరికి రూ.2 లక్షల రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. ముల్లంగి గ్రామానికి రెండు పదవులు బహుమతిగా (డిచ్‌పల్లి ఎంపీపీ నర్సయ్య, మోపాల్ సొసైటి చైర్మన్ గంగారెడ్డి) ఇచ్చానని ఎమ్మెల్యే తెలిపారు. నియోజక వర్గానికి ఐదేళ్లలో 15 వేల ఇందిరమ్మ ఇళ్లు రానున్నాయని పేర్కొన్నారు. బిజెపి ఎంపీ ధర్మపురి అరవింద్ ఒక్క గ్రామానికి ఒక్క రూపాయి ఇచ్చింది లేదని, నిధులు వచ్చిన వెంటనే ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. చేవెళ్ల ద్వారా నియోజకవర్గంలోని ఒక లక్ష ఎకరాలకు ప్రతి గుంటకు నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటానని అన్నారు.

గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించండి..

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ముల్లంగి గ్రామం మొదటి నుంచి కాంగ్రెస్‌కు పట్టు ఉన్న గ్రామమని,. సిమెంట్ కాలువ నిర్మాణం కోసం రూ.2 కోట్లు, గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కెటాయించాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, ఎంపీపీ నర్సయ్య, సోసైటీ చైర్మన్ గంగారెడ్డి, సీనియర్ నాయకులు గంగాధర్, గంగారెడ్డి, భూపతి, అంజయ్య, లక్ష్మయ్య, మధు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ హయాంలో ఇచ్చిన వారికి పట్టాలు అందజేస్తాం..

గతం నుండి అటవి భూమిలో పంటలు పండిచుకుంటున్నవారికి పట్టాలను అందజేస్తామని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని నక్కలగుట్ట తండాలో రూ.25 లక్షల వ్యయంతో గోదాముల నిర్మాణానికి ఎమ్మెల్యే భూపతి రెడ్డి, సోసైటీ చైర్మన్ రాంచందర్ గౌడ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోడు భూములు సాగుచేసుకున్న వారికి వైఎస్ హయంలో పట్టాలు ఇచ్చిన వారికే కొత్తగా పట్టాలు ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు .కార్యక్రమంలో తండా నాయకులు రవి,గంగారాం, బీమానాయక్, మోటిసింగ్, మన్నిరా పాల్గొన్నారు.

మా సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లండి.
కస్తూర్బా టీచర్ల వినతి

మండలంలోని కస్తూర్బా పాఠశాల, కళాశాలను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. మరికొన్ని సమస్యలను ప్రత్యేకాధికారిణి సవిత ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం బోధన సిబ్బంది కలిసి ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. తమ సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో కస్తూర్బా ఉపాధ్యాయులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించారని పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అమృత పూర్ గంగాధర్, మోత్కురి నవీన్ గౌడ్, సోసైటి చైర్మన్ తరచంద్ నాయక్, రాంచందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి,డిసిసిబి డైరెక్టర్ కోరట్ పల్లి అనంద్,రాజేశ్వర్, సీనియర్ నాయకులు డాక్టర్ శాదుల్ల,కంచెట్టి గంగాధర్, మోహన్ రెడ్డి,వైస్ చైర్మన్ అరెపల్లి గంగారాం, విడిసి చైర్మన్ అరెపల్లి మోహన్, విట్టల్ రావు, శ్యాం సన్, గంగాధర్, గంగారెడ్డి, భూపతి, అంజయ్య లక్ష్మయ్య, మధు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.


ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

ఇంజనీరింగ్ కళాశాలలో ఫస్ట్ ఫేజ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంజనీరింగ్ కళాశాలలో చేరుటకు ఎపీసెట్ -2024. మొదటి విడత ప్రవేశాల ప్రక్రియ ఈనెల 04 నుండి మొదలవుతుందని జిల్లా సమన్వయకర్త సి. శ్రీరామ్ కుమార్, సిస్టమ్ అడ్మిన్ కె.భాను చందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా స్లాట్ బుకింగ్ ప్రక్రియ ఈనెల 04 నుండి 12 వరకు ఉంటుందని పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు సర్టిఫికేట్ వెరిఫికేషన్ కొరకు ఆయా హెల్ప్ లైన్ సెంటర్లకు ఈ నెల 6 నుండి 13 లోపు వెళ్ళాలని సూచించారు. వెరిఫికేషన్ ఆన్లైన్‌లో వెబ్ ఆప్షన్ ఈ నెల 08 నుండి 15 వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. సీట్లు కేటాయింపు ఈ నెల 19 లోగా ఉంటుందని తెలిపారు. మరింత సమాచారం కోసం హెల్ప్ లైన్ సెంటర్‌గా వెబ్ సైట్ https://tgeapcet.nic.inను సందర్శించాలని పేర్కొన్నారు.

సిజివి కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండలంలోని భవిత కేంద్రంలో కేర్ గివింగ్ వాలెంటర్ (ఆయా) గా పని చేయడానికి ఈ నెల 6 వరకు డిచ్ పల్లి మండల విద్యా వనరుల కేంద్రం లో ధరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రాజా గంగారం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతి నెల గౌరవ వేతనం 3,250 రూపాయలు ఉంటుందని ఆయన వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పలు కుటుంబాలను పరామర్శించిన వేముల

నవతెలంగాణ - బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్ నగర్ నాగపూర్ బాల్కొండ గ్రామాలలో బుధవారం మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, ముప్కాల్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, నాయకులు దాసరి వెంకటేష్, ఎంపీటీసీ రామరాజ్ గౌడ్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఫయాజ్, మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ వాహబ్, తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినులను సన్మానిస్తున్న ఇన్‌ఛార్జి ఎంఈవో, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని బోయి గల్లి లో గల బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కూల్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్ లైన్ క్విజ్ పోటీలలో ప్రతిభ కనబరిచారు. జిల్లాస్థాయిలో యోగాపై నిర్వహించిన ఈ పోటీలలో టాప్ 10 మందిలో బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు యశ్విత మూడవ స్థానం, వాణి నాలుగవ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు, ఇంచార్జి ఎంఈఓ స్వామి, ఉపాధ్యాయులు రఘువాస్, లింబాద్రి, వాసుదేవ్, శివకుమార్, వినోద్, ఈశ్వర్ అభినందించారు.

బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతకొన్ని సంవత్సరాలుగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుశీల, కుదైజ, స్వరూప, మాలతి, యమునలకు తోటి ఉపాధ్యాయులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి మాట్లాడుతూ... బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని, నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ప్రగతికి కృషిచేయాలని కోరారు.

పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయురాలికి సన్మానం

నవతెలంగాణ - మెండోర

మండలంలోని బుస్సాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయిని గా విధులు నిర్వహించి పదోన్నతిపై వెళ్తున్న శారద దేవిని ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించి వీడుకోలు పలికారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలిని శాలువాతో సన్మానించారు. పాఠశాలలో అందరితో కలుపుగోలుగా ఉంటూ విద్యార్థులకు ఉన్నత అందించిన శారద దేవి కి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

5న జీపీ కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రామిక భవన్, కోటగల్లిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తెన్న, ఎం.సుధాకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. జీవో నంబర్ 60 ప్రకారం వెంటనే వేతనాలు పెంచాలని, పెండింగ్లో ఉన్న వేతన బకాయిలను చెల్లించాలని, ప్రతి నెల 5వ తేదీ లోపే వేతనాలు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని తదితర డిమాండ్లతో ఈనెల 5న కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మికులకు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రెస్ మీట్‌లో ఐఎఫ్‌టియు ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, జిల్లా నాయకులు బి.లింగం తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో పేలిన కుక్కర్

తృటిలో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని సుర్బిర్యాల్ గ్రామంలో బుధవారం ఓ ఇంట్లో మహిళ వంట చేస్తుండగా కుక్కర్ పేలింది. దీంతో కాలనీలో పెద్ద శబ్దం రావడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. కాగా కుక్కర్ పేలిన సమయంలో మహిళ బయటకు రావడంతో తృటిలో ప్రమాదం తప్పింది.

భార్గవి విద్యానికేతన్ విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్



తెలంగాణ రాష్ట్ర క్రీడ పాఠశాలల్లో నాలుగవ తరగతి ప్రవేశాలకు నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికలో మండలంలోని అంకాపూర్ భార్గవి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థిని సిరిసిల్ల పార్థ చందన ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయురాలు ప్రగతి పట్వారి బుధవారం తెలిపారు. ఈనెల 8, 9 తేదీల్లో హకీంపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం


ప్రజాప్రతినిధులను సన్మానించిన అధికారులు

నవతెలంగాణ-మెండోర

ఎంపిటిసి, ఎంపిపి, జడ్పీటీసిల పదవి కాలం గురువారంతో ముగియ నుండడంతో ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమం బుస్సాపూర్ రైతు వేదిక లో బుధవారం ఏర్పాటుచేశారు. ఎంపిడిఓ వనజ ప్రజాప్రతినిధులను శాలు వాలతో సన్మానించి మెమోంటోలు అందించారు. అనంతరం ఎంపిపి, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలుగా మండల అధికారులు, తోటి ప్రజాప్రతినిధులు, ప్రజలకు సేవలు అందించేందుకు అండగా నిలిచినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ వనజ, ఎంపిపి బురుకల.సుకన్య కమలాకర్, డిసిసిబి డైరెక్టర్ నాగంపేట శేఖర్ రెడ్డి, జడ్పీటిసి గంగాధర్, ఎంపీఓ, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షల ఫీజు తేదీప్రకటన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బి.ఎడ్ రెగ్యులర్ నాల్గవ సెమిస్టర్, 2020-21 విద్యా సంవత్సరం ఒకటవ, రెండవ,మూడవ,నాలుగవ సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షల ఫీజు 12 జూలై లోపు చెల్లించాలని 100 రూపాయల అపరాధ రుసుముతో 13-జూలై వరకు చెల్లించ వచ్చునని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ డాక్టర్.ఎం. అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ ను సంప్రదించాలన్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులుగా గణేష్

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కమ్మర్ పల్లి మండల అధ్యక్షులుగా చింత గణేష్ నియమితులయ్యారు. బుధవారం బాల్కొండ తెలంగాణ ఫంక్షన్ హాల్ లో జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో నూతనంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన దాసరి మూర్తి సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీలంతా ఐక్యతగా ఉండి బీసీ నాయకుని ఎమ్మెల్యే నుండి ఎంపీ వరకు ప్రధాని వరకు బీసీ నాయకుడే ఆధిపత్యం వహించేలా కృషి చేయాలన్నారు.. అనంతరం నూతనంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన దాసరి మూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి గ్రామ సంఘ అధ్యక్షులు భోగ రామస్వామి, గణపతి రామ్, చిలువేరి లక్ష్మణ్, భోగ శ్యామ్, చింత నాగరాజు, చింత నందకుమార్, చింత ప్రవీణ్, వంగ నవీన్, బీసీ నాయకులు, బీసీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థలు బంద్

నవతెలంగాణ - భీంగల్ రూరల్

ఈ నెల 4న కేజీ టు పీజీ వరకు విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలి అని బాల్కొండ ఎస్ఎస్‌యూఐ నాయకులు పిలుపునిచ్చారు బాల్కొండ నియోజకవర్గంలో ప్రైవేట్ యజమానులు బంద్‌కు సహకరించాలని నియోజకవర్గ అధ్యక్షుడు అక్షయ్ కోరారు. నీట్ పరీక్షలు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా తిరిగి నీట్ ఎక్సమ్ ప్రారంభించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప అధ్యక్షులు రెహ్మాన్, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ సందీప్ వెన్నెల , భీంగల్ మండల వైస్ ప్రెసిడెంట్ గౌరు ప్రశాంత్, భీంగల్ టౌన్ ప్రెసిడెంట్ సయ్యద్ అదనాన్ అలీ, బాల్కొండ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా డీఈఓ విచారణ

- సర్దుకు పోవాలి అంటూ సరిపెట్టుకున్న వైనం
- డీఈఓకు సన్మానించి గండం తప్పించుకున్న హెచ్ఎం
- సమాచారం లేదని వాపోయిన గ్రామస్తులు

నవతెలంగాణ ధర్పల్లి

గత కొన్ని నెలలుగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అక్రమాలు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయ లోపం, హెచ్ఎం భర్త పెత్తనం, మధ్యాహ్న భోజన బియ్యాన్ని అమ్ముకున్న సంఘట పట్ల విసిగి వేసారిన ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో నవతెలంగాణ కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ బుధవారం పాఠశాలను సందర్శించి తూతూ మంత్రంగా విచారణ చేసినట్లు తెలిసింది. ఉపాధ్యాయులు తాము ఎదుర్కుంటున్న పలు సమస్యలు అధికారి దృష్టికి తీసుకెళ్లిన, భర్త ఆగడాలు తెలిపినప్పటికీ అవేవి పెద్ద సమస ్యలు కానట్లు, బియ్యం అమ్ముకున్నది నిజం కానట్లు కొట్టిపడేసిన సదరు అధికారి తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకోవడం మాని హెచ్ఎం కన్నీళ్ళకు కరిగిపోయి ఉచిత సలహాలు ఇచ్చినట్లు కొందరు ఉపాధ్యాయులు తెలిపారు. గ్రామస్థులకు సమాచారం లేకుండా గ్రామపెద్దలు తెలుపకుండా విచారణ ఏమిటని గ్రామస్థులు వాపోతున్నారు. ఇలాంటి ఘటనలు తమ గ్రామంలో ఎప్పుడు జరగలేదని, ఉపాధ్యాయుల తీరు ఇలా ఉంటె విద్యార్థులపై ప్రభావం పడుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రధానోపాధ్యాయురాలిని బదిలీచేస్తేనే పాఠశాల బాగుపడుతుందని, అధికారులు ఇప్పటికైనా స్పందించి బదిలీ చెయ్యాలని కోరుతున్నారు. దీనంతటికి కారణం సదరు హెచ్ఎంకు అదే పాఠశాలలో ఇంచార్జ్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న మరో హెచ్ఎం భర్త జిల్లా కేంద్రంలోని జిల్లా విద్య శాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారని, ఆయనే ఇక్కడ జరిగే అక్రమాలకు కప్పిపుచ్చేందుకు ప్రధాన కారకుడని విశ్వసనీయంగా తెలిసింది. దానికి ప్రతిఫలంగా ఇక్కడ ఉన్న తన భార్యను బొర్గంపికి డిప్యూటేషన్‌పై వెళ్లేందుకు సదరు హెచ్ఎం సహకరిస్తారని విమర్శలు వినిపిస్తున్నాయి, ఏదేమైనప్పటికీ సన్మానంతో సంతోషపడ్డ పెద్దాయన ఒకరి కొకరు సహకరించు కోవాలని, కలిసి మెలిసి ఉండాలంటూ, ప్రధానోపాధ్యాయురాలి భర్త, ఇతరులు ఎవరైనా పాఠశాల ఆవరణలోకి రావద్దంటూ ఉచిత సలహాలు అందించడం పట్ల ఉపాధ్యాయ బృందం పెదవి విరుస్తుంది. .చేసిందంతా చేసి కన్నీళ్లతో అధికారులను మభ్యపెట్టడం తామెక్కడ చూడలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి అవార్డులకు గ్రామాల ఎంపిక

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ జిల్లాలోని కొన్ని గ్రామాలను జాతీయస్థాయిలో అవార్డులకు ఎంపిక చేసి పంపడం కోసం నిజామాబాద్ జిల్లా పరిషత్‌లో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు నిజామాబాద్ జిల్లా నుండి మోర్తాడ్, ఆర్మూర్, జక్రాన్ పల్లి, నిజామాబాద్, ఎడపల్లి ఇలా తొమ్మిది మండలాల నుండి ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగింది. దీంట్లో భాగంగా నిజామాబాద్ రూరల్ మండలంలోని శ్రీనగర్ అనే గ్రామాన్ని పచ్చదనం- పరిశుభ్రత అనే అంశంపై జాతీయ స్థాయికి పంపారు. కార్యక్రమంలో డిపిఓ సిహెచ్ తరుణ్ కుమార్, సీఈఓ బి ఉష, డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు తదితర అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, గ్రామాల అధికారులు, ఎంపీఓ, ఎంపీడీవో మధురిమ పాల్గొన్నారు.

పాత బకాయిలు వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-భీంగల్

మధ్యాహ్న భోజన కార్మికుల పాత బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ వర్కర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి ఆధ్వర్యంలో బుధవారం మండల విద్యాధికారి స్వామికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకుల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న కోడిగుడ్డు చార్జీలను ప్రభుత్వం గత ఐదు ఆరు నెలల నుండి చెల్లించడం లేదని తెలిపారు. పాఠశాలలు పున ప్రారంభం కావడంతో విద్యార్థులకు కోడిగుడ్లు అందించాలని నిర్వాహకులపై నెట్టి వేయడం సమంజసం కాదన్నారు. పాత బకాయిలు చెల్లించకుండానే మళ్లీ గుడ్లు అందించాలని ఒత్తిడి చేయడం మానుకోవాలని అన్నారు. వినతి పత్రం అందించిన వారిలో మండల మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఉన్నారు

హామీలను వెంటనే అమలు చేయాలి

సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా)
నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఐ ఎంఎల్. మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యు లు... ప్రభాకర్. డివిజన్ కార్యదర్శి. దేవరం పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వచ్చిన 100 రోజుల్లో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. 100 రోజులు గడిచిపోయిన రైతు భరోసా నేటికీ అమలు జరగలేదని, రైతు భరోసా విధి విధానాలు రూపొందించడానికి వేసిన సబ్ కమిటీ కనీసం రైతు సంఘాలను... రైతులతో సమావేశం నిర్వహించకుండా.. సహకార సంఘాలతో తీర్మానం చేయించి పేద మధ్యతరగతి రైతులకు అన్యాయం జరిగే విధంగా విధివిధాన రూపొందించే ప్రమాదం ఉందని అన్నారు. రైతు భరోసాను పీఎం కిసాన్ యోజన విధివిధానాల షరతులను రైతు భరోసాకు వర్తింప చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఇది సరియైన ఆలోచన కాదని గుర్తు చేస్తున్నామన్నారు.

సాగు చేయని వారికి రైతు భరోసా ఇవ్వవలసిన అవసరం లేదని, ఇది కేవలం సాగుకు పెట్టుబడి మాత్రమే అని అందుకని సాగు చేసే పోడు రైతులకు.. పేద మధ్యతరగతి రైతులకు.. పది ఎకరాల లోపు ఉన్న వారందరికీ రైతు భరోసా వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12 వేల పెన్షన్ ఇప్పటికి అమలు జరగలేదని ఎద్దేవా చేశారు.. పెన్షన్లు పెంచి ఇస్తానన్న మాట నిలబెట్టుకోలేదని గ్యాస్‌కు సబ్సిడీ అందరికీ రావడంలేదని అన్నారు. 200 యూనిట్ల లోపు ఉన్న వారందరికీ ఉచితవిద్యుత్ అమలు తిరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల బీమా పథకం బ్యాంక్ అప్పులు ఉన్న వారికే వర్తిస్తుందని అందుకని పట్టాదారు పాసు బుక్కు ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వమే వాటాధనాన్ని చెల్లించి బీమా చేయించాలని అన్నారు. అన్ని పంటలకు 500 రూపాయల బోనస్ ఇస్తానన్న మాట నిలబెట్టుకోలేదని, ఇది కేవలం సన్న ధాన్యానికి మాత్రమే ఇవ్వడం సరికాదని తెలిపారు. ఏకకాలంలో 2 లక్షల రుణం మాఫీకి ఆగస్టు 15వరకు కాలయాపన చేయడం సరికాదని ఖరీఫ్ సీజన్ ముందే రుణమాఫీ చేస్తే నూతన రుణాలు రైతుకు అందేవని అన్నారు.. వెంటనే ధరణిలో పెండింగ్లో ఉన్న సమస్యలన్నీటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను గుర్తించి వీరికి రైతు భరోసా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు..

100 రకాలపంటలు సాగు చేస్తే కేవలం 14 పంటలు మాత్రమే ఎం ఎస్పీ జాబితాలో చేర్చడం రైతు వ్యతిరేక ప్రభుత్వంగా తనకు తానే ప్రకటించుకుందని అన్నారు. ఎంఎస్‌పి గ్యారెంటీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం పార్లమెంట్లో పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు.. కేంద్ర ప్రభుత్వం బొగ్గుని ప్రైవేటు వారికి ఒప్పచెప్పడానికి బహిరంగ వేలం వేసే పద్ధతిని మానుకోవాలని డిమాండ్ చేశారు. బొగ్గును సింగరేణికి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. మెడికల్ విద్యకు ఎంట్రెన్స్ నిర్వహించే నీట్ పేపర్ లీకేజ్ బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించి ఆ శాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.. సమావేశంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు, ముత్తెన్న, పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షులు. నరేందర్. ఏఐపికెఎస్. జిల్లా నాయకులు రాజన్న.. ఐఎఫ్‌టీయూ నాయకులు. అరవింద్ పాల్గొన్నారు.